క్లుప్తంగా

తెలంగాణ అమరవీరుడు వేణుకుమార్‌గౌడ్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన తెలంగాణ అమరవీరుడు తాళ్లపెల్లి వేణుకుమార్ గౌడ్ 11వ వర్ధంతిని స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, వేణుకుమార్‌గౌడ్ తండ్రి ప్రభాకర్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేష్‌గౌడ్, సర్పంచ్ అహల్యాదేవి, ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్‌గౌడ్, మహిళా విభాగం నాయకురాలు శంకరమ్మ, మన్యం పద్మ, సర్పంచ్ సోమశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు చిరంజీవిగౌడ్, నవీన్‌జైస్వాల్, ఆనంద్, భరద్వాజ్ పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీ



ర్యాలీలో ఎమ్మెల్యే, క్రైస్తవులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో శనివారం క్రైస్తవులు నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ర్యాలీలో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొన్నారు. ర్యాలీ పట్టణంలోని వీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం ర్యాలీలో వచ్చిన వారికి పాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: ఈ నెల 14న కాగజ్‌నగర్ పట్టణంలో అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించతలపెట్టిన ఉత్సవ ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, అంబేద్కర్ ఉత్సవ కమిటీ పదాధికారులున్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న కేసీఆర్ సేవాదళం సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి పంపిణీ చేస్తున్నట్లు కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు ఉబేద్ బిన్ యాహియా (తారిఖ్) తెలిపారు. ప్రతీ సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా జిల్లా కేంద్రంలో ప్రతీ శనివారం అంబలి పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు అంబలి ఎంతో తృప్తినిస్తుందని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



శివాజీని పరామర్శిస్తున్న శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, బీజేపీ సిర్పూర్ తాలూకా నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరె సంఘం అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తున్న శివాజీపై పథకం ప్రకారం బీఆర్‌ఎస్ నాయకులు దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. ఈ దాడిపై సమగ్ర విచారణ చేపట్టాలని, తద్వారా నిజాలు బయటికి వస్తాయని అన్నారు.

చకచకా పనులు



కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

- గోలేటికి బీటీ రోడ్డు, బ్రిడ్జి మంజూరు
- రూ.5.65 కోట్ల మంజూరు
- బీటీ పూర్తయితే గోలేటి– రెబ్బెనకు తగ్గనున్న దూరభారం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

రెబ్బెన: గ్రామాల నుంచి మండల కేంద్రానికి మెరుగైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గోలేటి నుంచి వివిధ పని నిమిత్తం మండల కేంద్రానికి చేరుకోవాలంటే చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. గ్రామానికి బీటీ లేకపోవడం, రహదారి మధ్యలో వాగునీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అయితే ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం గోలేటి గ్రామవాసులకు తీపికబురు అందించింది. బీటీ రోడ్డు సౌకర్యంతోపాటు, వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఇద్దరు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. పనులు చకచకాగా కొనసాగుతున్నాయి. రోడ్డు నిర్మాణం పూర్తయితే గోలేటి నుంచి మండల కేంద్రానికి దూరభారం తగ్గనుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో..

రెబ్బెన మండలంలోని గోలేటి మేజర్ పంచాయతీ. దీని పరిధిలో సుమారు 10 వేల వరకు జనాభా ఉంది. ప్రభుత్వం తండాలను పంచాయతీలను చేసింది. దీంతో కైరిగూడ కొత్త జీపీ ఏర్పడింది. గోలేటి పరిధిలో సోనాపూర్, గోండుగూడ, దుర్గాపూర్, గోలేటి విలేజ్, భగత్‌సింగ్‌నగర్, దుబ్బగూడ, కైరిగూడ పంచాయతీ పరిధిలో కైరిగూడ తండాలున్నాయి. గోలేటి గ్రామం ఏర్పడి ఏళ్లుగడుస్తున్నా ప్రభుత్వ పరంగా మెరుగైన రోడ్డు సౌకర్యం లేదు. ప్రస్తుతం గోలేటితోపాటు కైరిగూడ పంచాయతీలకు సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన రోడ్డే దిక్కయింది. గతంలో గోలేటి–రెబ్బెన వరకు గొండూగూడ సమీపం నుంచి దేవులగూడ మీదుగా దారి సౌకర్యం ఉండేది. అధికారులు పట్టించుకోకపోవడంతో సింగరేణి రోడ్డు ద్వారా ప్రజలు దాదాపు 6.5 కిమీ ప్రయాణించి మండల కేంద్రానికి చేరుకునేవారు.

రూ.5.65 కోట్లతో బ్రిడ్జి, బీటీ మంజూరు..

గోలేటి నుంచి మండల కేంద్రం వరకు ప్రజలు చేరుకునేలా రోడ్డు సౌకర్యం కోసం ప్రభుత్వం కోట్లరూపాయల నిధులు మంజూరు చేస్తోంది. పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గోలేటి విలేజ్ వరకు 3.3 కి.మీ మేర బీటీ నిర్మాణానికి రూ. 3.28 కోట్లు, దారి మధ్యలో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 2.37 కోట్లు కేటాయించింది. రోడ్డు నిర్మాణం పూర్తయితే గోలేటి నుంచి కేవలం 3.8 కి.మీ దూరంతో మండల కేంద్రానికి చేరుకోవచ్చు. గోలేటితోపాటు గొండుగూడ, దుర్గాపూర్, కైరిగూడ గ్రామస్తులు మండల కేంద్రానికి చేరుకునేందుకు మార్గం మరింత సుగమమవుతుంది.



మొరం పోసి చదును చేసిన రోడ్డు

గతనెలలో పనులు ప్రారంభం

కాంట్రాక్టర్లు గతనెలలో పనులు ప్రారంభించారు. వర్షాకాలంలో ఆటంకం ఏర్పడే అవకాశం ఉండటంతో పనుల్లో వేగం పెంచారు. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, చెట్లు తొలగించి చదును చేసి మొరం పోశారు. రహదారి మధ్యలో ఉన్న పైపు కల్వర్టు, బ్రిడ్జి పనుల్లో ఎర్త్‌వర్క్ పూర్తి చేయగా ఫౌండేషన్ పనులు కొనసాగుతున్నాయి.

త్వరగా పనులు పూర్తిచేస్తాం

పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గొండుగూడ వరకు పనులు త్వరగా పూర్తిచేస్తాం. 3.3 కి.మీ మేర బీటీ కోసం రూ.3.28 కోట్లు మంజూరు కాగా రోడ్డు మధ్యలో ప్రవహిస్తున్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 2.37 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు పూర్తిచేస్తాం.

– కిరణ్‌కుమార్ ఏఈ ఆర్‌అండ్‌బీ

కోతులతో పరేషాన్



చెట్లపై ఉన్న కోతులు



పట్టణంలోని ఓ భవనంపై కోతుల సంచారం

- జిల్లాకేంద్రంలో గుంపులుగా సంచారం
- ఇళ్లు, దుకాణాల్లో చొరబడి ఎత్తుకెళ్తున్న సరుకులు
- రోడ్లపై వెళ్లేవారిపై దాడి
- భయాందోళనల్లో స్థానికులు

ఆసిఫాబాద్‌అర్బన్: అడవుల్లో ఆహారం లభించక కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయి. జిల్లాకేంద్రంలో రోజురోజుకు కోతుల బెడద పెరుగుతండడంతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు. కాలనీల్లో గుంపులు గుంపులుగా సంచరించి రోడ్లపై వెళ్లే ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. పెంకుటిళ్లను ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్ల, దుకాణాల్లో చొరబడి తినుబండారాలు, పప్పుదినుసులు, తదితర వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. ఆరుబయట ఎండబెట్టిన దినుసులు, ఇతర ఆహార పదార్థాలను లాక్కెళ్లి తింటున్నాయి. మామిడి, జామ, బొప్పాయి, ఇతర పండ్ల చెట్లు, కూరగాయల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి.

భయాందోళనలో ప్రజలు

పట్టణంలోని పలు కాలనీల్లో కోతుల బెడద రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్లపై వెళ్లాలన్నా జంకుతున్నారు. కోతులు ఇళ్లలో చొరబడి వీరంగం సృష్టిస్తున్నా తరిమే ప్రయత్నంలో అవి ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో కోతి కరిస్తే ఆసుపత్రుల పాలైన సంఘటనలున్నాయి. భవనాలపై గుంపులుగా ఒకేచోట చేరి వచ్చిపోయే వారిపై దాడులు చేస్తున్నాయి. కోతుల బెడద తీవ్రం కావడంతో కొంత మంది టపాసులు, పెద్ద శబ్దాలు వచ్చేలా ఏర్పాట్లు చేసుకుని తరిమేస్తున్నారు.

చర్యలు చేపట్టాలి

కోతులను బంధించి అటవీ ప్రాంతాలకు తరలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కోతుల నియంత్రణను సంబంధిత అధికారులు చొరవ చూపి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కోతుల బెడద నియంత్రణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని అంటున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ఇళ్లపై ఏర్పర్చుకొన్న డిష్ యాంటినాను కోతులు పడవేస్తున్నాయి. వాటర్ ట్యాంకుల్లో మలమూత్రాలు చేస్తున్నాయి. ఇళ్లలో ఆహార పదార్థాలను లాక్కెళ్తున్నాయి. కోతులతో ఇబ్బంది పడుతున్నాం. వాటి బెడద నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చీల కళావతి, టీఆర్‌నగర్, ఆసిఫాబాద్

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు అందిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గుడ్లబోరి గ్రామంలో కోనేరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ స్థాయి క్రికెట్ పోటీలు శనివారంతో ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన ముత్తంపేట జట్టుకు రూ. 25వేలు నగదుతోపాటు బహుమతి, గుడ్లబోరి జట్టుకు రూ. 12వేలతోపాటు బహుమతి అందజేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువకుల్లో దాగి క్రీడా నైపుణ్యాలు వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. యువత చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సర్పంచ్ పాలె రాందాస్, ఉప సర్పంచ్ సిడాం బాబురావు, నిర్వాహకులు దండ్రే బాలాజీ, భాస్కర్, ఉపాసే వినోద్, సునీల్, ప్రవీణ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

కౌటాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని తహసీల్దార్ సాయన్న అన్నారు. మండలంలోని సాండ్‌గాం, కౌఠి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. సర్పంచ్ ఎకోన్‌కార్ దామోదర్, టీచర్ జయంతి, ఆయా బయబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- కుట్టు మిషన్ల పంపిణీ

తిర్యాణి: మహిళా ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని ఎస్పీ సురేశ్‌కుమార్ సూచించారు. 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా శనివారం వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 20 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌తో ప్రజల్లో పోలీసులకు స్నేహపూర్వక వాతావరణం నెలకొందని, ప్రజలకు పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అసాంఘిక శక్తులు, కొత్త వ్యక్తులకు ఆశ్రమం కల్పించకూడదని, యువత చెడువ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, వసుధ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఉమ, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ నరేందర్, ఎస్సై రమేశ్, టైలరింగ్ శిక్షకురాలు రమాదేవి, సర్పంచులు సింధూజ, గుణవంత్‌రావు ఉన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



దండేపల్లి: మండల సమాఖ్య ఎదుట వీఓఏల నిరసన

దండేపల్లి: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల వీఓఏల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు దండేపల్లి శ్రీ లక్ష్మి మండల సమాఖ్య ఎదుట మండలంలోని వీఓఏలు శనివారం శాంతియుత ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు అనంతలక్ష్మి మాట్లాడుతూ.. వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించి, పీఆర్సీ అమలు చేయాలని, గౌరవ వేతనం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేయాలన్నారు. ఎస్సై ప్రసాద్ అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పారు. పదోతరగతి పరీక్షలు నడుస్తున్నందునా 144సెక్షన్ అమలులో ఉందని, ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టొద్దని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్సైకి అందించారు.

పూలే, అంబేద్కర్ సందేశ్‌యాత్ర



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

పాతమంచిర్యాల: కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న పూలే, అంబేద్కర్ సందేశ్‌యాత్ర నిర్వహిస్తున్నట్లు కులవివక్ష వ్యతిరేఖ పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలో సందేశ్‌యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజన మహనీయులు పూలే, అంబేద్కర్ అందించిన సామాజిక న్యాయ ఎజెండాను జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రచారం చేయడానికి కేవీపీఎస్ పని చేస్తుందన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేశ్, ఉపాధ్యక్షుడు వంజరి గోపి, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగురాజేశం, నాయకులు రాజ్‌కుమార్, ప్రేంకుమార్, మహేశ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ నాయకుల నిరాహార దీక్ష



దీక్షలో వైఎస్సార్‌టీపీ నాయకులు

మంచిర్యాలక్రైం: నిరుద్యోగుల, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో శనివారం వైఎస్సార్‌టీపీ నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాసి సతీష్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకేజీపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలోని విద్యార్థులకు మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

ప్రయాణ పాట్లు



చింతలమానెపల్లిలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

- జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాలలో బస్టాండ్లు
- పెంచికల్‌పేటలో తాత్కాలికం, సిర్పూర్‌లో కేటాయించిన స్థలం
- నిలపని బస్సులు
- ప్రయాణికులకు నీడ కరువు
- చెట్ల కింద ఎదురుచూపు

చింతలమానెపల్లి: జిల్లాలోని ఆసిఫాబాద్ కేంద్రంగా ఆర్టీసీ బస్‌డిపో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సిర్పూర్ నియోజకవర్గంలోని కాగజ్‌నగర్, కౌటాలలో ప్రయాణ ప్రాంగణాలు ఉన్నాయి. ఆర్టీసీ పరిధిలో పెంచికల్‌పేట మండలకేంద్రంలో గ్రామస్తుల చొరవతో తాత్కాలికంగా ప్రయాణ ప్రాంగణం ఏర్పాటు చేయగా సిర్పూర్(టి)లో గతకొన్నేళ్ల క్రితం స్థలాన్ని కేటాయించారు. కాని ప్రస్తుతం ఆ స్థలంలో బస్సులు నిలపడం లేదు. రాకపోకలు ఎక్కువే. నియోజకవర్గంలో రైలు, రహదారి మార్గాలు ఉండగా మహారాష్ట్రకు సమీపంలో ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలోనే రాకపోకలు సాగిస్తుంటారు. నియోజకవర్గానికి ఆనుకుని మహారాష్ట్రలోని గడ్చిరోలి, చంద్రపూర్ జిల్లాలు ఉండగా సరిహద్దు మండలాలకు కాగజ్‌నగర్, సిర్పూర్, చింతలమానెపల్లి, కౌటాల మీదుగా రవాణా రోడ్డు మార్గాలున్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, తదితర ప్రాంతాలకు మహారాష్ట్రవాసులు సరిహద్దుల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం చింతలమానెపల్లి మండలం గూడెం వద్ద ప్రాణహిత నదిపై వంతెన నిర్మాణం పూర్తి కాగా గడ్చిరోలి జిల్లా అళ్లపల్లి, ఏటాపల్లి, అహేరి, సిర్వంచ, చత్తీస్‌గఢ్‌లోని భోపాల పట్టణం, బీజాపూర్, దంతెవాడ, జగ్దల్‌పూర్‌లకు రవాణా మార్గంగా నియోజకవర్గం ఉంది.

రవాణా మార్గాలు..

జిల్లా కేంద్రంలోని డిపో ఆధ్వర్యంలో బస్సులు నడిపిస్తున్నారు. నియోజకవర్గం కాగజ్‌నగర్‌తోపాటు ఆయా మండల కేంద్రాల నుంచి మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు, రాష్ట్రంలోని మంచిర్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు బస్సులు నడిపిస్తోంది. మరిన్ని మార్గాలకు బస్సులను నడిపే యోచనలో డిపో అధికారులు ఉన్నారు.



కౌటాల మండలకేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం

ప్రయాణికుల ఇబ్బందులు

జిల్లాలో ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రధానంగా రోడ్డు మార్గంపై ఆధారపడుతున్నారు. మండలాల నుంచి బస్సుల ద్వారా ప్రాంతాలకు ప్రయాణిస్తున్నారు. నియోజకవర్గంలో కౌటాల, కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్‌లో ప్రయాణ ప్రాంగణాలున్నాయి. మిగతా ప్రాంతాల్లో లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. హోటళ్లు, దుకాణాల వద్ద, చెట్ల కింద వేచి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. తాగునీరు, మరుగుదొడ్లు, సేద తీరడానికి నీడ లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్లు లేక అందుబాటులో ఉన్న స్థలంలో మూత్రవిసర్జన చేస్తుండడంతో యజమానులు ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణ ప్రాంగణాలు లేక ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది.

ప్రయాణ ప్రాంగణాలు ఏర్పాటు చేయండి

ప్రతి మండలకేంద్రంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రయాణ ప్రాంగణాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది. మండల కేంద్రాలతోపాటు జిల్లాలో కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్, నలుగుపల్లి క్రాస్‌రోడ్, ఈస్‌గాం మరికొన్ని ప్రాంతాల్లో ప్రయాణికుల రద్దీ ఉంది. ఆయా ప్రాంతాల్లో అవసరాలను పరిగణనలోకి తీసుకుని బస్‌షెల్టర్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణ ప్రాంగణాల నిర్మాణాలను అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేస్తే ప్రయాణికుల ఇబ్బందులు తొలగడంతోపాటు ఆదాయం పెరిగే అవకాశం ఉంది. అధికారులు ఈ దిశగా సర్వే నిర్వహించి చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



అమ్మవార్లతో గ్రామస్తులు

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడలో మత్యాలమ్మ, లక్ష్మి దేవర విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులు జరిగే విగ్రహ ప్రతిష్ఠాపన కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు.